సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ၊ 25 ၊ జూన్ ၊ 2025



చీనీ టన్ను రూ.29,100

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళ వారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.29,100, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



ఆటో బండి.. కష్టాలు దండి

కూటమి సర్కార్ ఆటోడ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరించింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చకపోవడంతో ఆటోవాలాలు ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.6°/21.9°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్



అధికారులతో కలిసి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న వరకుమార్

ధర్మవరం: ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలో విద్యుత్‌శాఖ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పరిశీలించారు. ఏవైనా సమస్యలున్నాయా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ... వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రైతుల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణం స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులు కూడా తమ సమస్యలను నేరుగా విద్యుత్ అధికారులకు తెలియజేయాలన్నారు. లో ఓల్టేజి సమస్యను పూర్తిగా నివారిస్తామన్నారు. అందుకోసం అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చుతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరామ్, ఏడీ లక్ష్మీ నరసింహారెడ్డి, ఏఈలు నాగభూషణం, కొండయ్య, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పేపరు కొరత

- ధ్రువీకరణ పత్రాలు అందక రైతులు, విద్యార్థుల ఇబ్బందులు

నల్లమాడ: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ప్రింటెడ్ పేపర్ల కొరత నెలకొంది. ప్రస్తుతం బ్యాంకుల్లో పంట రుణాల రెన్యూవల్ జరుగుతోంది. పంటరుణం రెన్యూవల్ చేయాలంటే రైతులు తప్పనిసరిగా ఒరిజినల్ వన్‌–బీ బ్యాంక్‌లో సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఒరిజినల్ వన్‌–బీ ప్రింట్ తీసే పేపర్లు సచివాలయాల్లో స్టాకు లేకపోవడంతో రైతులు వన్‌–బీ పొందలేకపోతున్నారు. సకాలంలో పంట రుణాలు రెన్యూవల్ చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ప్రింటెడ్ పేపర్లు లేకపోవడంతో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల మంజూరులోనూ జాప్యం జరుగుతోందని విద్యార్థులు వాపోతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన తరుణంలో తక్షణం సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమష్టి కృషితోనే బాల్య వివాహాలకు చెక్

- బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించండి
- అధికారుల సమీక్షలో ఆర్డీఓ మహేష్



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: సమష్టి కృషితోనే బాల్య వివాహాలు జరగకుండా చెక్ పెట్టవచ్చని ఆర్డీఓ మహేష్ తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి బాల్యవివాహాలను నివారించాలని సూచించారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. గ్రామ, పట్టణ స్థాయిలో బాల్య వివాహాల నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి బాల్యవివాహాలు చేయాలని చూస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. బాల్య వివాహం బలవంతంగా చేసే వారిపై పోక్సో చట్టం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలతోపాటు నిరక్షరాస్యత, కుటుంబ సమస్యలు తీవ్రతరం అవుతాయని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే తహసీల్దార్, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు, లేదా టోల్ ఫ్రీ నంబర్ 1098కు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతిఒక్క అధికారి పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సురేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, సురేష్‌కుమార్, నారాయణస్వామి, మున్సిపల్ టీపీఆర్‌ఓ పెనుబోలు విజయ్‌భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

తారస్థాయికి తాగుడు

ఎక్కడ పడితే అక్కడే కిక్కు



అనంతపురంలోని తపోవనం నుంచి నారాయణపురం మార్గంలో దారి పక్కనే వైన్‌షాపు

- ఉమ్మడి జిల్లాలో రూ.1,300 కోట్లకు చేరువలో మద్యం అమ్మకాలు
- నెలకు సగటున రూ.145 కోట్ల విలువైన మద్యం తాగుతున్నట్టు అంచనా
- 9 మాసాల్లో 1.60 కోట్ల లీటర్ల మద్యం వినియోగం
- మరో 60 లక్షల బీర్ల సేవనం
- పర్మిట్‌రూములు, బెల్టుషాపులతో మత్తులో జోగుతున్న సామాన్యులు



తాడిపత్రిలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూము

అనంతపురం జిల్లాలో గత 9 మాసాల్లో మద్యం అమ్మకాలు ఇలా..

మద్యం అమ్మకం (లీటర్లలో)
99,12,006

విలువ
రూ. 792,12,78,746

శ్రీ సత్యసాయి జిల్లాలో ..

మద్యం అమ్మకం (లీటర్లలో)
61,58,430

విలువ
రూ. 477,98,89,352

సాక్షి ప్రతినిధి, అనంతపురం: బెల్టుషాపుల బెండు తీసే వారు కరువయ్యారు. పర్మిట్ల రూముల వైపు అసలు చూడడమే లేదు. 'పచ్చ' నేతలవే మద్యం షాపులు కావడంతో నిబంధనలు గాలికి పోయాయి. ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతోంది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా మద్యం మత్తులో జోగుతోంది. మద్యం వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు.

సామాన్యులే సమిధలు..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో దాదాపు అన్ని చోట్లా ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే మద్యం షాపుల నిర్వహణ జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో అమ్మకాలు ఎలా పెంచాలా అన్న కోణంలో ఇష్టారాజ్యంగా నిబంధనలకు తిలోదకాలిచ్చారు.మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండటంతో గడిచిన 9 మాసాల్లో రెండు జిల్లాల్లో 1.60 కోట్ల లీటర్ల మద్యం తాగినట్టు తాజా లెక్కల్లో తేలింది. దీన్నిబట్టి సామాన్యులు రోజువారీ మద్యం కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో అంచనా వేయొచ్చు.

ఎక్కడ చూసినా బెల్టుషాపులు

రెండు జిల్లాల్లో 200 వరకు మద్యం షాపులుంటే 2 వేలకు పైగా బెల్టు షాపులు ఉండటం గమనార్హం. దీంతో కూరగాయల షాపుల కంటే మద్యం షాపులే ఎక్కువగా ఉన్నట్టు తేలింది. చిన్న చిన్న గ్రామాల్లో సైతం తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో రెండు, మూడు బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఇక అర్బన్ ప్రాంతాల్లో వైన్‌షాప్‌ల పక్కనే అనధికార పర్మిట్ రూములు వెలిశాయి. దీంతో మద్యం లభ్యత పెరిగి విచ్చలవిడిగా వినియోగం అవుతున్నట్టు తెలుస్తోంది. రోజుకు ఉమ్మడి జిల్లాలో 60 వేల లీటర్ల మద్యం తాగుతున్నారని అంచనా. ఇక.. గడిచిన 9 మాసాల్లో 60 లక్షల బీర్లు తాగారు.

ఆఫర్లు పెట్టి మరీ..

మద్య నియంత్రణ గురించి పట్టించుకోకపోవడం, వైన్ షాపుల పక్కనే పర్మిట్ రూములు ఉండటంతో తాగినోడికి తాగినంత చందంగా మారింది. గతంలో బహిరంగ మద్యపానంపై 'సెబ్' ఉక్కుపాదం మోపేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ధాబాలు, హోటళ్లు, టీకొట్లలో కూడా తాగే వెసులుబాటు ఉండటంతో మద్యం వినియోగానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. కొన్ని చోట్ల భోజన ఆఫర్లు పెట్టిమరీ మద్యం సేల్స్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. హిందూపురం, కదిరి, తాడిపత్రి ప్రాంతాల్లో వేళాపాళా లేకుండా మద్యం అమ్ముతున్నట్టు తెలుస్తోంది.



అనంతపురం రంగస్వామి నగర్‌లో మద్యం దుకాణం వద్దనే మత్తులో పడిపోయిన ఓ వ్యక్తి

సొంత మండలంలో అవకాశమివ్వండి

- డీపీఓకు సచివాలయ ఉద్యోగుల వినతి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓడీచెరువు : సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలోనే బదిలీలకు అవకాశం కల్పించాలని సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దాదాగిరి చౌడప్ప కోరారు. ఈ మేరకు కొండకమర్ల సచివాలయాన్ని తనిఖీ చేసేందుకు మంగళవారం విచ్చేసిన డీపీఓ సమతను కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలు, రేషనలైజేషన్‌కు సంబంధించిన జీఓ సాకుతో సొంత మండలాలకు బదిలీ కాకుండా అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ జీఓను పునఃపరిశీలించాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ సంక్షేమ పథకాల అమలుకు నిత్యం కృషి చేస్తున్న తమ సేవలను గుర్తించాలన్నారు. ఇప్పటికే ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తమకు ప్రమోషన్ కల్పించిన తరువాతనే రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. జాయినింగ్ తేదీ నుంచి సర్వీసును పరిగణనలోకి తీసుకొని రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఆలస్యంగా ప్రొబేషన్ ప్రకటించినందున 9 నెలల కాలానికి ఆరియర్స్ మంజూరు చేయాలని కోరారు. అలాగే క్యాడర్ గుర్తింపు, టెక్నికల్ పదోన్నతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగులు బాబ్జాన్, నరేంద్ర, అంజి నాయక్, విజయ్, కుళ్ళాయప్ప, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

కేవీకే పుట్టపర్తిలోనే ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీఎస్ కేశవరెడ్డి తదితరులు

- వైఎస్సార్‌సీపీ నేతల డిమాండ్

పుట్టపర్తి: కృషి విజ్ఞాన కేంద్రాన్ని (కేవీకే) పుట్టపర్తి సమీపంలోనే ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి డిమాండ్ చేశారు. అలాకాకుండా మరో ప్రాంతానికి తరలిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. మంగళవారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. 2023లో అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కృషితో జిల్లాతో పాటు మూడు జాతీయ రహదారులు, పుట్టపర్తిలో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. రైతులకు ఎంతగానో ఉపయోగపడే కృషి విజ్ఞాన కేంద్రాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బత్తలపల్లి మండలానికి తీసుకెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. పుట్టపర్తిలోనే ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చొరవ చూపాలని.. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

గత ప్రభుత్వంలో మంజూరైన నల్లమాడలో మార్కెట్‌యార్డు, పుట్టపర్తిలో 20 ఎకరాల విస్తీర్ణంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం, రూ.864 కోట్ల వ్యయంతో ప్రారంభమైన 193 చెరువులకు నీళ్లు నింపే పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మలకవేముల క్రాస్ నుంచి నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మీదుగా కర్ణాటకలోకి కలిసే జాతీయ రహదారి మంజూరుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్, ఈశ్వరయ్య, గంగాద్రి, ఫొటో సాయి, చెరువు భాస్కర్ రెడ్డి, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

'ఎంటీఎస్' కౌన్సెలింగ్ మళ్లీ వాయిదా



బదిలీల్లో కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఎంటీఎస్ టీచర్లు

- దూర ప్రాంతాలకు వెళ్లేందుకు టీచర్ల ససేమిరా

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంటీఎస్ టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ మళ్లీ వాయిదా పడింది. మూడు రోజుల క్రితం జరిగిన కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేసిన టీచర్లు రెండోమారు మంగళవారం జరపాలని చూసిన కౌన్సెలింగ్‌లోనూ పాల్గొనకుండా బాయ్‌కాట్ చేయడం విశేషం. స్థానిక సైన్స్ సెంటర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్‌ను ఎంటీఎస్ టీచర్లు అడ్డుకున్నారు. తమపట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందంటూ వాపోయారు. తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, డీఏ, హెచ్‌ఆర్‌ఏ సదుపాయం ఉండదన్నారు. ఇలాంటి వారందరికీ జిల్లా సరిహద్దు మండలాల్లో కనీసం రవాణా సదుపాయం లేని స్కూళ్లకు కేటాయిస్తే ఎలా పోవాలి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నియర్ బై రెసిడెంట్' ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మొండిగా కౌన్సెలింగ్ చేసే ప్రయత్నం

మరోవైపు విద్యాశాఖ అధికారులు మొండిగా కౌన్సెలింగ్ చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో సీనియార్టీ జాబితాలో ఉన్న పేర్లను పిలుస్తూ లోపలికి వచ్చి నచ్చిన స్థానాలు ఎన్నుకోవాలి.. లేదంటే బలవతంగా స్థానాలు కేటాయించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో ఎంటీఎస్ టీచర్లు తిరగబడ్డారు. లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియను అంతటితో ఆపేశారు.

ఆర్జేడీ నోటా పాత మాటే

రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఆయనతో పాటు డీఈఓ ప్రసాద్‌బాబును చుట్టుముట్టారు. ఆర్జేడీ నోటి నుంచి కూడా పాతమాటే వచ్చింది. విద్యార్థులకు సరిపడా పోస్టులు మాత్రమే ఉన్నాయని అంతకు మించి చూపించడం సాధ్యం కాదంటూ తెగేసి చెప్పారు. దీంతో ఎంటీఎస్ టీచర్లు ఆర్జేడీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. 'మా జీవితాలతో ఆడుకోవద్దండి. ఇంత ఇబ్బందులు పెట్టే బదులు కాసింత విషం ఇచ్చి చంపండి' అంటూ వాపోయారు. సహకరించాలని ఆర్జేడీ కోరినా.. ఎంటీఎస్ టీచర్లు అంగీకరించలేదు. రాత్రి 8 గంటల సమయంలో బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు.

చేదు మిగిల్చిన మామిడి

- అరకొర కాపు.. దానికీ 'ఊజీ' దెబ్బ
- లబోదిబోమంటున్న రైతన్నలు
- బీమా ఊసే ఎత్తని కూటమి సర్కార్



ఇటీవల కురిసిన వర్షాలతో తోటలో రాలిన మామిడి కాయలు

తలుపుల: అందరికీ తీపి పంచిన మామిడి పండించిన రైతుకు మాత్రం చేదును మిగిల్చింది. సీజన్‌లో అరకొరగా వచ్చిన కాయలు కూడా ఊజీపురుగుల దెబ్బతో రాలిపోతున్నాయి. దీంతో ఎకరం సాగుకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు ఖర్చు అయ్యిందని, ప్రస్తుతం పెట్టుబడి కూడా దక్క లేదని రైతులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయం మామిడే

సంప్రదాయ పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలవైపు దృష్టి సారించారు. అందులోనూ ఎక్కువగా మామిడి పైనే మక్కువ పెంచుకున్నారు. ఇన్నాళ్లు సకాలంలో వర్షాలు కురిసి, దిగుబడి బాగా రావడంతో రైతులు ఆనందంగా మామిడి తోటలు సాగు చేశారు. ఫలితంగా జిల్లాలో ఏటికేడు మామిడి విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది.

రైతును విస్మరించిన కూటమి సర్కార్

ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాలతో పంట నష్టపోయినా ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశంతో రైతులు ఫసల్‌బీమా చెల్లించారు. జిల్లా వ్యాప్తంగా 2,353 మంది రైతులు 2013 ఎకరాలకు ఫసల్ బీమా చేశారు. గత నవంబర్‌లో వర్షాభావ పరిస్థితులతో జనవరి వరకు మామిడి తోటల్లో పూత ఆలస్యమైంది. ఆ తర్వాత ఎండ తీవ్రత, వాతావరణ పరిస్థితులతో పిందెలు నిలబడక కాపు అరకొరగానే కాసింది. దీంతో మే నెల దాటి జూన్ చివరికి వచ్చినా చాలా ప్రాంతాల్లో పంట తొలగించలేని పరిస్థితి ఏర్పడింది. పోనీ అరకొర పంటనైనా తొలగించుకుని విక్రయిద్దామంటే... నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు కాయలకు ఊజీ పురుగులు పట్టాయి. దీంతో కాయలన్నీ రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఊసేలేని ఫసల్ బీమా

పంటలు నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం ఫసల్ బీమా కింద పరిహారం అందించి ఆదుకునేది. అదికూడా పంట కాలం పూర్తయ్యేలోపే ఆర్థిక సాయం అందించేది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం పంటకాలం పూర్తయినా ఇంకా పంటనష్టపరిహారం అంచనాలే రూపొందించకుండా అన్యాయం చేస్తోందని రైతులు మండిపడుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



ఏ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఆ సీజన్‌లోనే సేకరించాలి. పక్కాగా పంట నమోదు చేసి నష్టపోయిన వారికి బీమా పరిహారం అందించాలి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. లేకపోతే వ్యవసాయం మానుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. – జి.వెంకటరమణ, టి.రెడ్డివారిపల్లి, తలుపుల మండలం

పరిహారం అందించాలి



మామిడి సాగు చేసిన రైతులంతా ఫసల్ బీమా చేశారు. అందువల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ సకాలంలో బీమాతో పాటు, నష్ట పరిహారం వర్తింపజేసి ఆదుకోవాలి. ఈ మేరకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి.
– వై. మోహన్‌రెడ్డి, ఎనమలదొడ్డివారిపల్లి, తలుపుల మండలం

సచివాలయ ఉద్యోగుల నిరసన బాట



గుడిబండ: ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



పెనుకొండ: ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

గుడిబండ: ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను స్థానికంగానే అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఐదేళ్లపాటు విజవంతంగా నడిపించింది. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని కూడా సాకారం చేసింది. అయితే ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల బదిలీలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సచివాలయ ఉద్యోగులు స్థానిక తహసీల్దార్ కార్యలయం వద్ద నిరసనకు దిగారు. సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ పట్టణ ఉద్యోగులకు మండలంలో కాకుండా స్థానిక వార్డులను యూనిట్‌గా పరిగణించాలని కోరారు. మిగులు సిబ్బందిని ఎలా గుర్తించి నిర్వహిస్తారనే దానిపై జీఓలో స్పష్టత లేదన్నారు. పారదర్శక ప్రమాణాలు లేకుండా డిప్యూటేషన్లు జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. బదిలీలు ప్రారంభించే ముందు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, ఇంక్రిమెంట్లు ఇతర ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని కోరారు. మరో రెండు రోజుల్లో కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే సచివాలయ ఉద్యోగులు పెన్‌డౌన్, సమ్మె వంటి వాటికి సైతం వెనుకాడేది లేదన్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ గంగాధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

పెనుకొండ రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఎంపీడీఓ నరేష్‌కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. మండల వ్యాప్తంగా వివిధ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, మంగళవారం ఎంపీడీఓకు కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

క్లుప్తంగా

పాల వ్యాన్ బోల్తా



నల్లచెరువు: మండలంలోని పెద్దయల్లంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై పాల వ్యాన్ అదుపు తప్పి మోరీకి ఢీకొని బోల్తా పడింది. తేజాస్ కంపెనీకి చెందిన పాల వ్యాన్ మంగళవారం కాలసముద్రంలో పాలు సేకరించుకుని చిత్తూరు జిల్లా పూతలపట్టులోని డెయిరీకి బయలు దేరింది. పెద్దయల్లంపల్లి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి వ్యాన్ అదుపు తప్పి మోరీని ఢీ కొట్టి జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంత లోకి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ శ్యాంప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి బలవన్మరణం

రాప్తాడు: మండలంలోని గంగలకుంట సమీపంలో మంగళవారం ఉదయం 8 గంటలకు రైలు కింద పడి ఓ గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ మేరకు ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 65 నుంచి 70 మధ్య వయస్సు గల వ్యక్తి తెలుగు రంగు చొక్కా, నలుపు రంగు డ్రాయర్, బ్రౌన్ కలర్ లుంగీ ధరించాడు. అతనికి ఎడమ కాలు లేదు. రెండు చేతులు కూడా అవిటిగా ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు 95502 16049, 99513 25345 కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

జేఎల్ఎం ఆత్మహత్య



మురళీకృష్ణ (ఫైల్)

పరిగి: మండలంలోని కాలువపల్లికి చెందిన డీఎల్ మురళీకృష్ణ(53) ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురంలోని విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ఆయనకు భార్య నాగరత్నమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడిగెనహళ్లిలో నివాసముంటూ రోజూ విధులకు వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో నాలుగేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ మాత్రలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నాడు. వ్యాధి మరింత ముదురుతుండడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం రాత్రి 9 గంటలకు కొడిగెనహళ్లి నుంచి సొంతూరు కాలువపల్లికి వెళ్లి, తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికీ తండ్రి ఇంటికి రాకపోవడంతో కుమారుడు కాలువపల్లికి వెళ్లి పరిశీలించాడు. అప్పటికే ఇంట్లో వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న దృశ్యాన్ని చూసి బంధువులకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంగడు యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆటో బండి.. కష్టాలు దండి

- ఆటోవాలా సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు
- కార్మికుల కష్టాలు పట్టించుకోని కూటమి సర్కార్
- ఎన్నికల హామీ మేరకు ఏటా రూ.15 వేలు నేటికీ ఇవ్వని వైనం
- గతంలో 'వాహన మిత్ర' ద్వారా ఆదుకున్న వైఎస్ జగన్
- ఏటా రూ.10 వేలతో పాటు సంక్షేమ పథకాలన్నీ అందజేసిన వైనం



పుట్టపర్తిలో నిలిపిన ఆటోలు

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆటోవాలాకు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందేది. అలాగే వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక చేయూత దక్కేది. అయితే కూటమి ప్రభుత్వంలో ఆటోవాలా గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. ఎన్నికల హామీ మేరకు ఏటా రూ.15 వేల ఇవ్వాల్సి ఉన్నా.. ఇప్పటికీ హామీలతోనే సరిపెడుతున్నారు. తాజాగా ఆగస్టుకు ఈ పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ఆర్భాటంగా ప్రకటించినా అది కార్యరూపం దాల్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా తమకు ఆర్థిక ఇబ్బందులు తప్పవని జిల్లాలోని సుమారు 30 వేల మంది ఆటో డ్రైవర్లు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు పలు హామీలను చంద్రబాబు గుప్పించారు. బ్యాడ్జి కలిగిన అన్ని వాహనాల డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం, భారీ జరిమానాలకు కారణమవుతున్న జీఓ నంబర్ 21, 31 రద్దు చేస్తామన్నారు. అలాగే డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గింపు, టాటా మ్యాజిక్ వ్యాన్లు జీపులు, కార్లకు గ్రీన్ ట్యాక్స్ థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌లు, టోల్‌గేట్ ఫీజులు తగ్గిస్తామన్నారు. డ్రైవర్లకు సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యారుణాల మంజూరు, చంద్రన్న బీమా ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తామంటూ గొప్పలకు పోయారు. అధికారం చేపట్టి ఏడాది గడచిన ఆటో డ్రైవర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో అరచేతిలో వైకుంఠం చూపి తమను మోసం చేశాడని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం తగ్గి... ఖర్చులు పెరిగి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతోంది. దీంతో రోజంతా కష్టపడితే రూ.300 నుంచి రూ.400 వరకు మిగలని పరిస్థితి నెలకొంది. ఏటా ఇన్సూరెన్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేల వరకు ఖర్చు అవుతోంది. వీటితో పాటు పోలీసులు, రవాణా శాఖ అధికారులు తనిఖీల పేరుతో వేలాది రూపాయల జరిమానా విధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణానికి నెలవారీ కంతులు కట్టుకోలేక ఆటో కార్మికులు బతుకులు దిన దిన గండంగా మారాయి. వచ్చే అరకొర ఆదాయం ఇంధనం, ఇతర ఖర్చులకు సరిపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది.

గతంలో అండగా నిలిచిన జగన్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అర్హులైన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేల చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేసి ఆదుకున్నారు. దీంతో పాటు ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల బీమా వర్తింపజేశారు. అలాగే వాహనం కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ. 3 లక్షల వరకూ వడ్డీ రాయితీ అందించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో చంద్రబాబు ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదు. పైగా జరిమానాలు పెరిగిపోయాయి. కూటమి సర్కార్ ఇప్పటికైనా ఆటో కార్మికుల గురించి ఆలోచించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ. 15 వేల ఆర్థిక సాయంతో పాటు 21, 31 జీఓల రద్దు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

– చిన్న శేఖర్, ఆటో డ్రైవర్, పుట్టపర్తి

మాట నెలబెట్టుకోవాలి



ఇప్పటి వరకూ ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆటో డ్రైవర్లను గుర్తించిన నాయకుడు లేరు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో మా సమస్యలు గుర్తించి అధికారంలోకి రాగానే ఆదుకుంటామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఏటా రూ.10 వేలు అందజేశారు. చంద్రబాబు కూడా ఎన్నికల సమయంలో మాకు అనేక హామీలిచ్చారు. వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– తిరుపాల్ నాయక్, డ్రైవర్, బ్రాహ్మణపల్లి తండా

ఏపీఎంఎస్‌కు బస్సు ఏర్పాటు



మోడల్ స్కూల్ వద్ద బస్సు దిగుతున్న విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి అర్బన్: వివిధ గ్రామాల నుంచి పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్ (ఏపీఎంఎస్)కు రాకపోకలు సాగించే విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేశారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఇలా ఇంకెన్నాళ్లు?!' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు వెంటనే బస్సు ఏర్పాటు చేశారు. రోజూ బడి వేళకు విద్యార్థులను పాఠశాలకు చేర్చడమే కాక, సాయంత్రం ఆయా గ్రామాలకు తీసుకెళ్లేలా ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. తమ కష్టాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న 'సాక్షి'కి ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు



సేకరించిన నేత్రాలను అందిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు




రామకృష్ణ(ఫైల్)

ధర్మవరం అర్బన్: స్థానిక శాంతినగర్‌కు చెందిన పామిశెట్టి రామకృష్ణ (70) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖరరెడ్డి, సభ్యులు మృతుడి కుటుంబసభ్యులను కలసి నేత్రదానంతో మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చునని, అవగాహన కల్పించారు. దీంతో అంత బాధలోనూ రామకృష్ణ నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో మృతుడి నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రొవైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, ఆప్తాల మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుటుంబ సభ్యులు నాగమ్మ, సావిత్రి, సురేష్, రవి, కిరణ్, నాగరత్న, మంజుల, ఆదినారాయణ, మాధవకు విశ్వదీప సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కిడ్నాప్ కేసు నమోదు

నల్లమాడ: అన్నాచెల్లెలును కిడ్నాప్ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు నల్లమాడ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు.. ప్రకాశం జిల్లా నల్లమడుగుల గ్రామానికి చెందిన గాయపు అంకమ్మ, ఏసురత్నం దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కట్టెలు కాల్చి బొగ్గుల చేసే పనిపై ఆధారపడి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో అంకమ్మ తన కుటుంబసభ్యులతో కలసి సోదరుడు సమరం నగేష్ వెంట ఇటీవల నల్లమాడ మండలం దొన్నికోట గ్రామానికి వలస వచ్చి బొగ్గులు కాల్చే పనిని చేపట్టారు. ఈ నెల 22న రాత్రి ఒంటి గంట సమయంలో ఏసురత్నం ఇంట్లో లేని సమయంలో నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బొగ్గుల వ్యాపారి (సేటు) ఎం.యంగయ్య, మరో నలుగురు వచ్చి అంకమ్మ, ఆమె సోదరుడు నగేష్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని పోయారు. 23న వారి బారి నుంచి తప్పించుకుని ఇద్దరూ దొన్నికోటకు చేరుకున్నారు. అదే రోజు రాత్రి నల్లమాడ పోలీసులకు అంకమ్మ ఫిర్యాదు చేశారు. పాత బాకీ తీర్చాలంటూ తనను, తన సోదరుడిని యంగయ్య, మరో నలుగురు కిడ్నాప్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ అనంతరం మంగళవారం కిడ్నాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



కోనేటి సుధాకర్ (ఫైల్)

బత్తలపల్లి: మేడపైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కడప జిల్లా వేంపల్లి మండలం అయ్యవారిపల్లికి చెందిన కోనేటి సుధాకర్ (38) బతుకుదెరువు నిమిత్తం 11 ఏళ్ల క్రితం బత్తలపల్లికి వచ్చాడు. ఆర్టీటీ ఆస్పత్రి సమీపంలో టిఫెన్ హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న రాత్రి మిద్దెపై పడుకునేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో భార్యతోపాటు స్థానికులు వెంటనే ఆర్టీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం.. అటు నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.సుధాకర్‌కు భార్య, కుమార్తె అద్వైత, తల్లి ఉన్నారు.

బాల పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి అర్బన్: 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ – 2026'కి గాను అర్హులైన బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్రీడలు, శౌర్యం, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి తదితర రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన బాలలకు అవార్డులను అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు జూలై 31వ తేదీ లోపు https://awards.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

మామిడిలో యాజమాన్యం చేపట్టండి

- శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ డీడీ చంద్రశేఖర్ సూచన

అనంతపురం అగ్రికల్చర్: మామిడి కోతలు పూర్తయిన అనంతరం సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్ సూచించారు. తోటల్లో కాయలన్నీ కోసిన తర్వాత ఒక నీటి తడి ఇచ్చి ఎండుపుల్లలు, పూతకాడలు, ఆకుగూళ్లను తొలగించాలన్నారు. చెట్టు మధ్య భాగంలో ఉన్న చిన్న కొమ్మలు, నాలుగు దిక్కులా సూర్యరశ్మిని అడ్డుకునే కొమ్మలను తొలగించి గాలీవెలుతురు ప్రసరించేలా కత్తిరించాలన్నారు. బాగా ముదిరిన పెద్ద చెట్లలో రంపం లేదా పవర్‌సాను ఉపయోగించి చెట్టు ఎత్తును తగ్గించాలన్నారు. అనంతరం కత్తిరించిన కొమ్మల చివర కాపర్ సంబంధిత శిలీంధ్రం లేదా కార్బండిజమ్‌ను పూయాలని తెలిపారు. తొలకరి సమయంలో చెట్టు మొదలు దగ్గరగా భూమిని దున్నడం లేదా పాదులు తవ్వి తిరగేయాలని తెలిపారు. జూన్, జూలై మాసంలో ఎకరాకు 10 కిలోలు జీలుగ లేదా 25 కిలోలు జనుము లాంటి పచ్చిరొట్ట పైర్లు వేసి 40 నుంచి 45 రోజుల సమయంలో భూమిలో కలియదున్నితే సేంద్రియ పదార్థం, భూసారం బాగా పెరుగుతుందన్నారు. ప్రతి చెట్టు పాదులో 100 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు లేదా 10 కిలోలు వర్మికంపోస్టు వేయాలన్నారు. సిఫారసు చేసిన విధంగా ప్రతి చెట్టుకూ 1.7 కిలోల యూరియా, 1.1 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్పేట్, 1.15 కిలోల పొటాషియం సల్ఫేట్ లేదా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఏడాదికి రెండు సార్లు అంటే జూన్–జూలై అలాగే అక్టోబర్–నవంబర్‌లో వేయాలన్నారు. కొత్త చిగుర్లు వచ్చే సమయంలో 5 గ్రాముల జింక్ సల్ఫేట్ , 2 గ్రాముల బోరాక్స్, 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే వచ్చే ఏడాది మంచి దిగుబడులు పొందవచ్చునని పేర్కొన్నారు.

సీహెచ్‌సీలో స్వీపర్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న లక్ష్మి

గోరంట్ల: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఔట్ సోర్సింగ్ కింద స్వీపర్‌గా పనిచేస్తున్న లక్ష్మి ఆత్మహత్యాయత్నం చేసింది. బాధితురాలు తెలిపిన మేరకు.. ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో శుభ్రత చేసే అంశంపై తరచూ లక్ష్మిని హెడ్ నర్సు మల్లమాంబ వేధింపులకు గురి చేస్తూ ఉండేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆస్పత్రిలో పనిలో నిమగ్నమైన లక్ష్మిని ఆక్షేపిస్తూ మల్లమాంబ తీవ్ర స్థాయిలో మందలించింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి... అక్కడే ఉన్న నిద్ర మాత్రలు మింగింది. విషయాన్ని గమనించిన తోటి సిబ్బంది వెంటనే వైద్యాధికారి ఉష దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన వైద్యులు ఆగమేఘాలపై ఆమెకు చికిత్స అందజేసి, ప్రాణాలు కాపాడారు. ఈ విషయమై డాక్టర్ ఉష ను వివరణ కోరగా లక్ష్మి తన విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో హెడ్ నర్సు మల్లమాంబ మందలించడం వాస్తవమని, చిన్నపాటి అంశానికి ఆమె నిద్ర మాత్రలు మింగిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పోక్సో కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండలంలోని గోవిందపల్లి పంచాయతీలో ఇద్దరు బాలుర్లపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుల్లయ్య తెలిపారు. వివరాలను మంగళవారం వారు వెల్లడించారు. రాఘవేంద్ర కాలనీలో 3వ తరగతి చదువుతున్న ఓ బాలుడిని అదే కాలనీకి చెందిన 13 ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు బాలురు మాయ మాటలతో నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించారు. దీంతో బాధితుడు ఏడ్చుకుంటూ ఇంటికి చేరుకోవడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం ఇద్దరు బాలుర్లపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యాక్టరీలో చోరీ.. నిందితుల అరెస్ట్

హిందూపురం: స్థానిక తూముకుంట పారిశ్రామిక వాడలోని స్వస్తిక్ ఫ్యాక్టరీలో ఐరన్ అపహరించిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు హిందూపురం అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 22న ఫ్యాక్టరీలో రూ.1.50లక్షల విలువ చేసే ఐరన్‌ను దుండగులు అపహరించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో తూముకుంటకు చెందిన ఆటో డ్రైవర్ అర్బాత్‌షాషా, పరిశ్రమలో పనిచేస్తున్న యూపీలోని బల్లియా జిల్లా పర్వత్‌పూర్‌కు చెందిన దేవానంద్, చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌కు చెందిన యశ్వంత్ సాహును మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వీరి నుంచి 25 కిలోల బరువున్న 32 బండిళ్ల బైండింగ్ వైర్, 20కేజీల తూకం వేసే 33 రాళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రేపటి నుంచి జీవాలకు టీకాలు

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు మంగళవారం నుంచి ఉచితంగా టీకాలు (వ్యాక్సినేషన్) వేసే కార్యక్రమం మొదలవుతుందని పశుసంవర్ధక శాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీ డీఎల్) ఏడీ డాక్టర్ రవిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలకర్లు ప్రారంభం కావడంతో వర్షాకాలంలో సాధారణంగా వ్యాపించే నట్టలు (డీవార్మింగ్), నీలినాలుక వ్యాధి (బ్లూటంగ్), థైలేరియాసీస్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 49 లక్షలు గొర్రెలు, 9 లక్షల మేకలు... మొత్తంగా 58 లక్షల జీవాలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆర్ఎస్‌కేల వేదికగా శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ చేపట్టడానికి పారాస్టాఫ్‌తో బృందాలు ఏర్పాటు చేశామన్నారు.

'అనంత'లో యువకుడి హత్య



విగత జీవిగా పడి ఉన్న సిదానంద

అనంతపురం: నగరంలోని బళ్లారి బైపాస్‌లో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన రామలింగ కుమారుడు జి. సిదానంద (28)కు అదే మండలం యర్రగుంట్ల గ్రామానికిచెందిన ఎర్రిస్వామి కుమార్తె శోభాతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. గార్లదిన్నెలో కాపురం ఉండేవారు. ఈ క్రమంలో పది నెలల క్రితం శోభ ఆత్మహత్య చేసుకుంది. ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో సిదానందను పోలీసులు అప్పట్లో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. రిమాండ్ నుంచి వచ్చిన అనంతరం అనంతపురంలోని పాతూరులో ఉన్న ఓ కిరాణా షాపులో సిదానంద పనిలోకి చేరాడు. రోజూ ఉదయం కోటంక నుంచి అనంతపురానికి వచ్చి వెళ్లేవాడు. మూడు రోజుల క్రితం అనంతపురానికి వచ్చిన సిదానంద ఆ తర్వాత ఇంటికి వెళ్లలేదు. మంగళవారం ఉదయం బళ్లారి బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అన్న క్యాంటీన్ సమీపంలో అందరూ చూస్తుండగా దుండగులు సిదానంద తలపై బండరాయితో మోది హతమార్చారు. సమాచారం అందుకున్న నాల్గో పట్టణ పీఎస్ సీఐ జగదీష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి జేబులో లభ్యమైన గుర్తింపు కార్డు ఆధారంగా వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచార ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. హతుడి తమ్ముడు జి. దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, సిదానంద భార్య ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఆమె కుటుంబసభ్యులు తీవ్ర ఆవేశానికి లోనవుతూ సిదానందను చంపుతామని బెదిరించినట్లు హతుడి కుటుంబసభ్యులు గుర్తు చేశారు. దీంతో శోభ కుటుంబసభ్యులా, లేదా ఇతర కారణాలతో మరెవ్వరైనా ఈ ఘాతుకానికి తెగబడ్డారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్య జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దారుణానికి పాల్పడింది ఎవరనేది స్పష్టం కాలేదు.

మహిళను కత్తులతో బెదిరించి బంగారు అపహరణ



జరిగిన ఘటనను పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు లక్ష్మీదేవి

బెళుగుప్ప: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను కత్తులతో బెదిరించి బంగారు నగలు, నగదు అపహరించిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం రామసాగరం గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న తోటలో తన కుమారుడు శ్రీనాథరెడ్డితో కలసి ముడిమి లక్ష్మీదేవి నివాసముంటోంది. సోమవారం రాత్రి కూరగాయలు తీసుకు వచ్చేందుకు శ్రీనాథ్‌రెడ్డి రామసాగరం గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో గదిలో లక్ష్మీదేవి వంట చేస్తుండగా ముగ్గురు ఆగంతకులు లోపలకు ప్రవేశించారు. వంట గదిలో ఉన్న లక్ష్మీదేవిని వెనుక నుంచి అదిమిపట్టి కిందపడేసి కత్తులతో బెదిరిస్తూ నోట్లోకి గుడ్డలు కుక్కారు. ఆమె శరీరంపై ఉన్న బంగారు చైను, చేతిలోని నాలుగు బంగారు గాజులు లాక్కొని, ఇంట్లో ఉన్న రూ.96వేల నగదును అపహరించారు. కొద్ది సేపటికి ఇంటికి చేరుకున్న కుమారుడు విషయం తెలుసుకున్ని గ్రామంలోకి వెళ్లి బంధువులకు, గ్రామస్తులకు తెలపడంతో చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, ప్రొబేషనరీ డీఎస్పీ అస్రప్ అలీ, సీఐలు మహానంది, ప్రవీణ్‌కుమార్, విడపనకల్లు, వజ్రకరూరు ఎస్ఐలు ఖాజాహుస్సేన్, నాగస్వామి, బెళుగుప్ప ఎస్ఐ శివ పరిశీలించారు. స్నిఫ్పర్ డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్ టీం సాయంతో నిందితుల వేలి ముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'ఉద్యానం' చుట్టూ అధ్వానం



కార్యాలయం వద్ద మద్యం సీసాలు పడేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణం ఇందిరమ్మ కాలనీలోని ఆరుబయలులో ఏర్పాటు చేసిన ఉద్యాన శాఖ వనరుల కేంద్రం పరిసరాలు అధ్వానంగా మారాయి. సిబ్బంది విధులు ముగించుకుని వెళ్లాక ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మందుబాబులు ఇక్కడే సిట్టింగ్ వేస్తున్నారు. మద్యం తాగి.. అక్కడే సీసాలు పడేస్తున్నారు. కొందరు పగులగొడుతున్నారు. దీనికితోడు స్థానికులు ఇక్కడ ఎవ్వరూ ఉండరని కార్యాలయ తలుపుల వద్ద మెట్లపైన, సమీపాన మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. ఉదయం పూట విధులకు హాజరైన సిబ్బంది ఆ కంపును దాటి లోనికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. పోలీసులు రాత్రిపూట గస్తీ నిర్వహిస్తే మందుబాబులు రాకుండా ఉంటారని కార్యాలయ సిబ్బంది అంటున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

VOCATIONAL COURSES

■ LM&D (డైరీయింగ్ & పశువిద్య), MLT, MPHW(F), C&T కోర్సులకు 2025 సం॥ అడ్మిషన్స్ జరుగుచున్నవి. అర్హత : 10th ఆపైన, హాస్టల్ కలదు. సెల్: 9985566783 [SCA25005150]

GNM అడ్మిషన్స్

■ ఇంటర్మీడియట్‌లో Any Group స్టూడెంట్స్‌కి G.N.M (Nursing) నందు Goverment సీట్స్‌కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. Only గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. సంప్ర: G.మురళి, 9030661651,అనంతపురం. [A-1648]

అడ్మిషన్స్

■ B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ) కోర్స్‌కి గవర్నమెంట్ సీట్స్‌కై అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. అర్హత:- ఇంటర్మీడియట్‌లో Bi.P.C గ్రూప్ పాస్ (లేదా) Any ఒకేషనల్ గ్రూప్‌తో పాటు బ్రిడ్జి కోర్స్ పాస్. Cont: G.MURALI, 9030661651, అనంతపురం. [A-1657]

REAL ESTATE

గోడౌన్ బాడుగకు

■ ATP, కమలానగర్‌లో సెల్లార్ గోడౌన్ (12x65 చ॥అ॥) హోల్‌సేల్‌షాపుకు, ఏజెన్సీలకు బాడుగకు ఇవ్వబడును. లోడ్ / అన్‌లోడ్, నీటి సౌకర్యం కలదు. Cell: 9880966520, 8074075776. [A-398]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6759]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED

■ ATP లో ఫ్లైవుడ్ షాపు నందు పనిచేయుటకు Tally & Input, Output అనుభవం గల అకౌంటెంట్ కావలెను. సంప్ర॥ సెల్: 9676358269. [A-400]

■ అనంతపురంలో ఇండియన్ డ్రైవింగ్ స్కూల్ నందు పనిచేయుటకు 5 సంవత్సరాల అనుభవం ఉన్న డ్రైవర్లు (40 YRS PAINA) కావలెను. 20,000/-సెల్: 9848276667, 9347086772. [SCA25005448]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239. [G-615]

■ Work from home మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 08801. [SCA 25005380]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 18K. Ph: 9640468899, 9640258899 [SCA25005265]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 96032 03355, 92814 52843. [SCA25005423]

■ మర్చంట్ నేవీలో cruise shipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్టుమెంట్స్ వ: 18–27, Qly : 10th & అబోవ్, లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt.Ltd Hyd., T.G, కోయంబత్తూర్ (TN) 7675982065 [SCA25005446]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

4 లైన్లు రూ. 270/-

అదనపు లైను రూ. 60/-

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307

DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088

HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933

GUNTAKAL & TADIPATRI : 9912220722

KADIRI : 7093150088

RAYADURG : 9010470185